# ఉత్తరప్రదేశ్ రైతాంగంపై హత్యాకాండను ఖండించండి!

**ఉత్తరప్రదేశ్** రాష్ట్రం – లఖింపూర్‌ఖేరి జిల్లాలో మూడు వ్యవసాయ, ప్రజావ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతాంగం పైకి కేంద్రమంత్రి అజయ్‌మిశ్రా కాన్వాయ్‌లోని కారు దూసుకెళ్ళి నలుగురు రైతులతో సహా మొత్తం 8 మంది ప్రాణాలను బలిగొంది. అజయ్‌మిశ్రా కొడుకే రైతులపైకి ఉద్దేశ్యపూర్వకంగా కారును వేగంగా నడిపించి వారిని హత్యగావించాడు. ఇంకా అనేకమంది గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో రైతాంగంపై జరిగిన ఈ హంతక దాడిని ఏఐకెఎమ్‌కెఎస్ తీవ్రంగా ఖండిస్తోంది. రైతాంగ, ప్రజావ్యతిరేక సాగు చట్టాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, దానికి చట్టబద్ధతనివ్వాలని కోరుతూ పది నెలలపైగా ఢిల్లీ సరిహద్దులనే నివాసంగా చేసుకొని వేలాదిమంది రైతాంగం మొక్కవోని దీక్షతో ఆందోళన సాగిస్తున్నారు. దేశవ్యాపిత రైతాంగ ఉద్యమంగా ఇది విస్తరించింది.

రైతాంగ న్యాయమైన డిమాండ్‌ను తలొగ్గటానికి బదులు కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్రాలలోని బిజెపి ప్రభుత్వాలు రైతాంగ ఉద్యమంపై అణచివేతను ప్రయోగిస్తున్నాయి. 'సాగు చట్టాలను నిరసిస్తున్న వారికి కర్రలతో బుద్ధి చెప్పండి' అని హర్యానా ముఖ్యమంత్రి ఇటీవలే బిజెపి, సంఘ్ పరివార్ శక్తులను ఎగద్రోశాడు. 'ఉద్యమకారుల తలలు పగులకొట్టమని' ఐఏఎస్ అధికారి ఒకరు పోలీసుల్ని రెచ్చగొట్టాడు. ఈ క్రమంలో రైతాంగంపై జరిగిన ఈ హత్యాకాండ తీవ్రంగా గర్హనీయమైంది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, ప్రధాని మోడీలే ఈ ఘటనకు బాధ్యత వహించాలి.

నల్ల చట్టాలను కేంద్రం వెనువెంటనే ఉపసంహరించుకోవాలని, హంతకులను కఠినంగా శిక్షించాలని ఏఐకెఎమ్‌కెఎస్ డిమాండ్ చేస్తోంది. ప్రాణాలు కోల్పోయిన రైతాంగ ఉద్యమకారులకు జోహార్లర్పిస్తోంది.

**విజయవాడ**
**4-10-21**

**ఎస్. ఝాన్సీ**, కో–కన్వీనర్
ఏఐకెఎమ్‌కెఎస్